క్లుప్తంగా

వైభవుడికి నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజ భోగ నివేదన ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పిస్తామని ఈవో తెలిపారు.

ముస్లింల చందనోత్సవ యాత్ర


మర్రిపాలెంలో వేడుకలు జరుపుకుంటున్న ముస్లింలు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం మసీద్ వీధిలో మస్జిద్-ఈ-అల్ ఫతా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం హజ్రత్ ఖాదర్ వలీ, హజ్రత్ మౌలా అలీ నిషానీ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిపాలెం శ్యామ్ నగర్ కాలనీ, గ్రీన్ గార్డెన్స్, పార్వతీ నగర్, హుస్సేన్ నగర్, జాకీర్ హుస్సేన్ నగర్ తదితర ప్రాంతాల్లో చందనోత్సవ యాత్ర చేశారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ధమాల్ పార్టీ పలువురిని ఆకర్షించింది. యాత్ర అనంతరం ముస్లింలు మసీద్ సమీపంలోని హజ్రత్ ఖాదర్ వలీ, హజ్రత్ మౌలా ఆలీ వారి నిషాని షరీఫ్ వద్ద ఫాతెహా తబ్రుక్ అందజేశారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ పర్యవేక్షించిన కార్యక్రమంలో బాబా, ఉమర్, ఉర్స్ కమిటీ సభ్యులు మున్నా, నాసీర్ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ బీవోఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు


ఏయూ వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చెర్మన్‌గా ఆచార్య పి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం విభాగంలో బీవోఎస్ చెర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆచార్య వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయం గౌరవ గ్రంథాలయాధికారిగా సేవలు అందిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాల వార్డెన్‌గా కూడా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లును విభాగ ఆచార్యులు, ఉద్యోగులు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మల్కాపురం: స్థానిక దుర్గానగర్‌లోని ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్న ముగ్గురు పోలీసులకు పట్టుబడ్డారు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ..దుర్గానగర్‌లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు మల్కాపురం పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడ వెళ్లి ఆ వ్యక్తులను పట్టుకుని వారి నుంచి రూ. 17 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ లూథర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతి కానుకల పంపిణీ

సీతంపేట: సంక్రాంతి పండగను పురస్కరించుకుని శుక్రవారం వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీను బాబు అక్కయ్యపాలెం కార్యాలయంలో జర్నలిస్టులకు 600 కిలోల బెల్లం, సింహాచలం క్యాలెండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ వేదికగా 13 రాష్ట్రాల జర్నలిస్టుల అసోసియేషన్‌లతో ప్రత్యేక సమావేశం జరగనుందన్నారు. జాతీయ స్థాయి లో జర్నలిస్టులకు సంబంధించి సమస్యలను పరిష్కరించాలని కోరుతామని చెప్పారు.

తెలుగు వెలుగుల సంక్రాంతి

కళాకారుల సందడి


పౌర గ్రంథాలయంలో సంక్రాంతి సంబరాలు

సీతంపేట: ప్రతిభ సాంస్కృతిక, క్రీడా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి టి.అడవిరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త, సంస్థ ముఖ్య సలహాదారు ఎం.వి.రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన సంక్రాంతి పండగను జరుపుకోవడం అదృష్టమన్నారు. మకర సంక్రాంతి రోజుల్లో మన పూర్వీకులను, పెద్దలను ఆరాధించుకునే ఈ పండగకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, పి.బి.ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించాయి. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి హరిదాసు వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సామాజిక విశ్లేషకుడు సన్‌మూర్తి, మెలోడి క్రియేటర్స్ అధ్యక్షుడు సిహెచ్.సత్యనారాయణ, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల నడుమ పండగ


మాధవధారలో భోగి మంట వద్ద కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, స్థానికులు

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్పొరేటర్ కార్యాలయం వద్ద ఉన్న స్మోక్ అవుట్ బీబీక్యూ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సంబరాల్లో ముఖ్య అతిథిగా కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆనందంగా పండగ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. భోగి మంట వేసి అంతా చుట్టూ చేరి సందడి చేశారు. బీబీక్యూ యజమాని భరత్, శ్యామ్ గణేష్, సాధు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మురళీనగర్‌లో సంక్రాంతి సంబరాలు

మురళీనగర్: ప్రతి ఏడాది మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వినూత్నంగా నిర్వహించే సంక్రాంతి సంబరాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మురళీనగర్, మాధవధార ప్రాంతాల ప్రజలు భోగి పండగ నాడు వైశాఖి పార్కులో సకుటుంబ సమేతంగా ఒక చోట చేరి వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజాము నుంచి ఇక్కడ సంబరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. భోగి మంటలు వేసి భోగి జావ, పాయసం వండి ప్రజలకు పంచుతారు. అనంతరం చిన్నారులకు భోగిపళ్లను వేసి ఆశీర్వచనాలు అందిస్తారు. గంగిరెద్దుల ఆటలు, తప్పెట గుళ్లు, పులివేషాలు, కోలాటాలు, సంక్రాంతి పాటలకు నృత్యాలు, వినూత్న వేషధారణలు ప్రదర్శిస్తారు. తెలుగు సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ సంక్రాంతి శోభతో పల్లె దిగి వచ్చిందన్నట్లు జన సందడి ఉంటుంది. ఈ పండగలో పాల్గొనడానికి విదేశాల్లో ఉన్న స్థానికులతోపాటు విదేశీయులు సైతం ప్రత్యేక సెలవులపై ఇక్కడికి వస్తారు. బంధుమిత్ర సమేతంగా ఈ ఉత్సవాల్లో పాల్గొని సంతోషంగా గడుపుతారు.

వైభవ వేంకటేశ్వరుడి ఆలయం ముస్తాబు

నేడు భోగి, గోదారంగనాథుల కల్యాణ వేడుకలు


వైభవుడి ఆలయంలో సంక్రాంతిని ప్రతిబింబించే గ్రామీణ వాతావరణం సెట్

మురళీనగర్: సంక్రాంతి సంబరాలకు కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం చూడచక్కగా ముస్తాబైంది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో సంక్రాంతి శోభను ప్రతిబింబించేలా అలంకరణ చేశారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద చెరకు గడల అలంకరణ, ప్రాంగణంలో పల్లె వాతావరణాన్ని తలపించేలా సెట్ ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయంలో పూజలు చేస్తారు. అనంతరం 5.15గంటలకు భోగి మంట వేసి గోదాదేవి అమ్మవారి ప్రదక్షిణ నిర్వహిస్తారు. అమ్మవారి తరఫున శ్రీరంగనాథుడికి తిరుప్పావై సేవా కాలంలో భాగంగా 30వ పాశుర విన్నపం నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం గోదా రంగనాథుల ఉత్సవ విగ్రహాలను ఆలయ ఉత్తర ద్వారం సమీపంలో నిర్మించిన ప్రత్యేక వేదిక వద్దకు తోడ్కొని వచ్చి ఆశీనులను గావిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుంది. వేదికపై 40 మంది కల్యాణ దాతలు పాల్గొంటారు. ఆలయ అర్చకులు వాసు, శేష స్వాముల ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం జరుగుతుంది. అనంతరం దాతలు, భక్తులకు విందు భోజనాలు ఏర్పాటు చేస్తారు.


ధ్వజ స్తంభం వద్ద చెరకు గడలతో అలంకరణ

పెద్ద పండగకు వేళాయె..


సంక్రాంతి ముగ్గు వద్ద తెలుగు వారి సందడి

- నేడు భోగ భాగ్యాల భోగి
- మకర సంక్రాంతితో కొత్త వెలుగులు
- విందు భోజనాల కనుమ

కంచరపాలెం: తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతికి వేళాయింది. పిల్లలు, పెద్దలు అంతా కలిసి సందడి చేసే సమయం ఆసన్నమైంది. మూడు రోజుల ముందుగానే నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. శనివారం భోగి పండగతో మకర సంక్రాంతికి ప్రజలు స్వాగతం పలకనున్నారు. భోగి రోజున వేడి నీళ్ల స్నానం.. సంక్రాంతి రోజున సంప్రదాయ పూజలు.. కనుమ రోజున నోరూరించే విందు భోజనాలతో తెలుగు వారు సంతోషంగా గడుపుతారు. ఏటా సంక్రాంతి పండగ రోజుల్లో ఎన్నో విశేషమైన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అవేంటో తెలుసుకుందాం...

భోగి మంటలు..

భోగి మంట లేకుండా సంక్రాంతి సందడి మొదలు కాదు. ఈ పండగలో మొదట వచ్చే భోగి రోజు ఉదయాన్నే ప్రజలు మంటలు వెలిగించి వేకువజామున వేన్నీళ్ల స్నానం చేస్తారు. దీని కోసం నెలరోజుల ముందు నుంచే విరిగిన వస్తువులు, చెక్కలు సేకరించి దాచిపెడతారు. భోగి స్నానాలు చేసి మంటకాస్తే పిల్లలు బాగా ఎదుగుతారనే నానుడి ఉంది.

మేలుకొలుపు..

ధనుర్మాసం ప్రారంభమైంది మొదలు మేలుకొలుపు సందడి కూడా ఉంటుంది. పల్లె ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. వేకువజామున హరినామ స్మరణ, కీర్తనలు పాడుతూ కాలనీల్లో తిరుగుతూ కానుకలు స్వీకరిస్తారు. కంచరపాలెం, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం మొదలు నగరమంతటా మేలుకొలుపు నిర్వహిస్తుంటారు.

పరసల కోలాహలం

ప్రతి ఏటా సంక్రాంతి పండగ రోజున జ్ఞానాపురంలో అనంతరం కనుమ రోజున గవర కంచరపాలెం, ముక్కనుమ రోజున రామ్మూర్తిపంతులుపేటలో పరస మహోత్సవాలు జరుపుతారు. ఏడు గ్రామాల ప్రజలు ఇందులో పాల్గొంటారు. సాముగరిడి, కోలాటం, పులివేషాలు, తప్పెటగుళ్లు, నేలవేషాలు, చెక్క భజన తదితరాలు ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తాయి. నగరంలోని పలుప్రాంతాల ప్రజలు పరసల సందడిని చూడడానికి వస్తారు.

పిల్లలు–పతంగులు..

సంక్రాంతి వచ్చిందంటే చాలు పిల్లలకు పతంగుల పండగే. ఆ రోజున రంగురంగుల గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేస్తారు. ఇప్పటికే పలు చోట్ల పతంగులు అమ్మే ప్రత్యేక దుకాణాలు వెలిశాయి.

ముచ్చటగొలిపే రంగవల్లులు..

రంగవల్లుల సందడి జనవరి ఒకటి నుంచే మొదలవుతుంది. ఒకరికి పోటీగా మరొకరు కొత్త ఏడాదికి ఆహ్వానం పలుకుతూ మహిళల ముగ్గుల పరంపర సంక్రాంతికి తారాస్థాయికి చేరుకుంటుంది. లక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ వివిధ రంగులతో రంగవల్లులను తీర్చిదిద్దుతారు. రథం, హరిదాసు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి నత్యాలు చేస్తారు. అందరి కంటే తాము వేసిన ముగ్గే అందంగా ఉండాలని తాపత్రయ పడుతుంటారు. ఈ ఆసక్తిని గమనించే పలు కాలనీ సంఘాలు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహిస్తుంటారు.

హరిదాసుల సందడి..

సంక్రాంతి పండగంటే మదిలో మెదిలేది హరిదాసులే. తల మీద అక్షయపాత్ర, ఓ చేతిలో తంబుర, మరో చేతిలో చిడతలు వాయిస్తూ వారి రూపం మన కళ్ల ముందు కదలాడుతుంది. వాడవాడల్లో హరిదాసులు తిరుగుతూ సంక్రాంతి శోభను ఇంటికి తీసుకొస్తారు. వీరిలో ఓ ప్రత్యేకత ఉంది. ఒకరు వెళ్లే ప్రాంతానికి మరొకరు వెళ్లరు. అక్షయపాత్ర తలపై ఉన్నంత సేపు మరొకరితో మాట్లాడరు. ఇలా సరదాగా.. సందడిగా.. ఆనందంగా ప్రజలంతా బంధు మిత్ర, కుటుంబ సమేతంగా సంక్రాంతి పండగను జరుపుకుంటారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు


48వ వార్డు ప్రజలతో మాట్లాడుతున్న కె.కె.రాజు

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు చేరుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 48వ వార్డు బాపూజీనగర్ సచివాలయాల పరిధిలో పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. కొండవాలు ప్రాంతాల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి పథకాలు అమలవుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను గుర్తించారు. ఇటీవల శంకుస్థాపన చేసిన పనులను త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఆయనకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, సీనియర్ నాయకుడు కర్రి రమారెడ్డి భూలోక, నాగేశ్వర రావు, సుగుణకుమారి, శ్రీను, నరేష్, సాల్మన్‌రాజు, చౌదరి విష్ణు, లక్ష్మి, కె.కె.శ్రీను, కనక మహేష్, భరత్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణం నేడు


ప్రత్యేక అలంకరణలో గోదారంగనాయకులు

సీతంపేట: భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని అక్కయ్య పాలెం లలితా పీఠం, శ్రీనివాసనగర్ శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం, సీతంపేట రాధాకృష్ణ మందిరంలో శనివారం గోదాదేవి, రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లలితా పీఠంలో ఉదయం 9గంట ల కు గోదారంగనాయకుల దివ్య కల్యాణ మహోత్సవం సామూహికంగా జరుగుతుందని, అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు గోదా రంగనాయకుల కల్యాణం జరుపుతామని ఆలయ అర్చకుడు నంబాళ వేంకట కూర్మాచార్యులు చెప్పారు. ఈమేరకు ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు.

అందుబాటులోకి ఫుట్‌పాత్


అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ కూడలిలో నిర్మించిన ఫుట్‌పాత్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ కూడలిలో సుమారు రూ.20 లక్షలతో ఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దాలిరాజు సూపర్ మార్కెట్ ముందున్న డ్రెయిన్ చాలా కాలం కిందట నిర్మించింది కావడంతో దాని గట్లు శిథిలమై పూడుకుపోయింది. దీంతో మురుగునీరు తరచు రోడ్డెక్కి ప్రవహించేది. సమస్య పరిష్కారమయ్యేలా జీవీఎంసీ మంజూరు చేసిన నిధులతో ఆర్‌సీసీ డ్రెయిన్ నిర్మించారు. గతంలో ఒకటిన్నర అడుగుల వెడల్పుతో డ్రెయిన్ ఉండగా.. ఇప్పుడు రెండున్నర అడుగుల వెడల్పుతో 75 మీటర్ల పొడవునా నిర్మించారు. డ్రెయిన్‌పై పలకలు వేసి పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌ను తీర్చిదిద్దారు. నిత్యం రద్దీగా ఉండే అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో ఫుట్‌పాత్ నిర్మించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ చాలా రద్దీగా ఉంటోందని, పాదచారులు, వృద్ధులు, పిల్లలు నడిచేందుకు వీలుగా మెయిన్ రోడ్‌లో పూర్తి స్థాయిలో ఫుట్‌పాత్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మార్కెట్లు కళకళ


అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో విక్రయిస్తున్న చెరుకు గడలు

సీతంపేట: సంక్రాంతి పండగను పురస్కరించుకుని జనంతో మార్కెట్లు కళకళలాడాయి. శనివారం భోగి పండగ కావడంతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని దుకాణాల్లో దుస్తులు, పూజా సామగ్రి, చెరకు గడల విక్రయాలు జోరుగా సాగాయి. కొనుగోలుదారుల రద్దీతో మార్కెట్ ప్రాంతమంతా సందడిగా మారింది.

14న మకరజ్యోతి దర్శనం

అల్లిపురం: అయ్యప్ప స్వామి మకర జ్యోతి పూజ, దర్శనం ఈ నెల 14వ తేదీన టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు సాయిశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగే ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, జ్యోతి దర్శనం చేసుకుని తరించాలని కోరారు.

శాస్త్రోక్తంగా నృసింహ దీక్ష విరమణ


ఘాట్ రోడ్డులో తిరుముడులతో వస్తున్న దీక్షాధారులు

సింహాచలం: అడవివరానికి చెందిన సింహాద్రి మఠం ఆధ్వర్యంలో శ్రీనృసింహ దీక్షల విరమణ శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగింది. మండల దీక్ష, 32 రోజుల దీక్ష చేసిన 3,860 మంది భక్తులు సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో దీక్షా విరమణ చేశారు. ఈ సందర్భంగా వారంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీక్ష విరమించిన వారిలో విశాఖ ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దీక్షాదారులంతా ఘాట్ రోడ్డు, మెట్ల మార్గంలో తిరుముడులతో సింహగిరికి చేరుకున్నారు. అనంతరం సింహగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దీక్ష విరమణ చేశారు. సింహాచలం దేవస్థానం తరఫున దీక్షాదారులందరికీ స్వామి వారి అంతరాలయ దర్శనం కల్పించారు.

108 రకాల స్వీట్లతో సారె సమర్పణ


సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


అమ్మవారికి నివేదించిన 108 రకాల స్వీట్లు

సీతంపేట: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం లలితా నగర్‌లోని లలితా పీఠంలో భోగి పండగ నాడు గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అమ్మవారి భక్తులు శుక్రవారం సాయంత్రం సారె ఊరేగింపు నిర్వహించారు. పలువురు భక్తులు, మహిళలు పాల్గొని పసుపు, కుంకుమ, గాజులు, చీర, పువ్వులు, పండ్లు, 108 రకాల స్వీట్లు సారెలో ఊరేగించారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో అమ్మవారికి నివేదించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రజలతో మమేకం కండి


గృహసారథులకు సూచనలిస్తున్న డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు

మురళీనగర్: గృహసారథులు ప్రజలతో మమేకమవుతూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు అన్నారు. ఇటీవల 49వ వార్డులో నియమితులైన సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో వార్డు కార్యాలయంలో శుక్రవారం ఆయన సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి క్లస్టర్‌కు ఇద్దరు గృహసారథులను నియమించినట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమన్వయంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వార్డులోని కాలనీల్లో కల్పించిన మౌలిక వసతులు, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అందరితో స్నేహ భావంతో మెలగాలని సూచించారు. ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ఐనింటి రవికుమార్, మహిళా నాయకులు బి.సరస్వతి, వి.కమలకుమారి, ఆర్.పావని, సీనియర్ నాయకులు ఎస్.చంద్రమౌళి, కె.ఢిల్లీరావు, రమణారెడ్డి, పి.నాగరాజు, చైతన్య, బి.శివరామప్రసాద్, కె.మున్నా, బి.శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా ధారోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం నాలుగో రోజు ధారోత్సవాలు ఘనంగా జరిగాయి. వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఒక పల్లకిలో, మరో పల్లకిలో సువర్ణ అమ్మవారు, చతుర్భుజ తాయారు, గోదాదేవి అమ్మవారిని తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. గంగధార వద్ద ఉన్న పురాతన మండపంలో స్వామిని, అమ్మవార్లను ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు అధిష్ఠింప జేసి విశేష పూజలు నిర్వహించారు.

సత్తా చాటిన ఆంధ్రా బాడీ బిల్డర్లు


మిస్టర్ ఇండియా పోటీల్లో సత్తా చాటిన రాజేష్

అల్లిపురం: పశ్చిమ బంగాలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన 57వ మిస్టర్ ఇండియా–2023 పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొని తమ సత్తా చాటారు. దేశ నలుమూలల నుంచి 29 రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 65 కేజీల విభాగంలో పోటీ పడ్డ రాజేష్ ప్రథమ స్థానంతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ రన్నరప్‌గా నిలిచి ఆంధ్రప్రదేశ్ కీర్తి, ఖ్యాతిని దేశం నలుమూలలా చాటారు. అలాగే 70 కేజీల కేటగిరీలో సంగడి రమేష్ ద్వితీయ స్థానం సాధించగా, 80 కేజీల విభాగంలో నార్ని శివదుర్గా అవినాష్ మూడో స్థానం సాధించారు. మాస్టర్ విభాగంలో కె.రామునాయుడు నాలుగో స్థానంలో సత్తా చాటారు. ఏపీ నుండి పాల్గొన్న వారందరూ టాప్ 10లో నిలిచారు. మిస్టర్ ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన వారందరికీ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.గురునాథరావు, కోశాధికారి టి.రాము, అర్గనైజింగ్ సెక్రటరీలు వి.విజయకుమార్, జోగి కిరణ్, ఉపాధ్యక్షుడు బీపీ రెడ్డి, జి.విష్ణుమూర్తి అభినందనలు తెలిపారు.